# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 18, మార్చి 2026




## గ్యాస్ గోదాంను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

**సారంగాపూర్, మార్చి 17, ప్రభాతవార్త:**

ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల మంగళవారం మండల కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీని, అక్రమ మొరం తవ్వకాలను పరిశీలించారు. గ్యాస్ సరఫరాలో జాప్యం, భద్రతా ప్రమాణాల లోపాలపై ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. వినియోగదారులు గోదాంకు రావాల్సిన అవసరం లేకుండా, నిర్దిష్ట గడువులోగా గ్రామాల్లో డోర్ డెలివరీ చేయాలని ఆదేశించారు. డెలివరీలో జాప్యం జరిగినా లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ సరఫరాపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం జాం గ్రామంలోని చెరువులో జరుగుతున్న అక్రమ మొరం తవ్వకాలను కలెక్టర్, ఎస్పీ తనిఖీ చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అవసరాల మేరకు మొరం తవ్వకాలు చేపట్టాల్సి వస్తే రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఇసుక, మొరం అక్రమ రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహశీల్దార్ సంధ్యారాణి, ఎస్సై శ్రీకాంత్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్‌పీవి వ్యాక్సిన్ అందించాలి



*** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె హరిత**

**తిర్యాని, మార్చి 17, ప్రభాతవార్త:**

జిల్లాలో 9 నుండి 14 సంవత్సరాల లోపు గల బాలికలకు ప్రతి ఒక్కరికి హెచ్.పి.వి. వ్యాక్సిన్ అందించాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. మంగళవారం తిర్యాని మండల కేంద్రంలోని చింతపల్లిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను నీతి అయోగ్ కేంద్ర ప్రతినిధి అశ్ల శర్మతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, రోగుల వార్డులు, మందుల నిల్వల గది, ప్రసూతి పట్టికను పరిశీలించి నెలలో జరుగుతున్న ప్రసవాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి చికిత్స కొరకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే వారికి శుద్ధ జలం అందించే ఆర్ఓ ప్లాంట్‌ను వెంటనే మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 9 నుండి 14 సంవత్సరాల లోపు వయసు గల బాలికలకు హెచ్.పి.వి. వ్యాక్సిన్ అందించాలని, ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా నిరోధించవచ్చని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో సంపూర్ణత అభియాన్ లో భాగంగా పశువులకు ఉచితంగా అందిస్తున్న గాలికుంటు నిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొని మండలంలో వంద శాతం పశువులకు టీకాలు వేయాలని, ప్రతిరోజు మూడు గ్రామాల మిగతా 2లో..



## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**లక్షెట్టిపేట, మార్చి 17, ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజతో మిగతా 2లో..


## కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**✦ వాసిరెడ్డి సీతారామయ్య ✦ సింగరేణి వ్యాప్తంగా ఏఐటీయూసీ ధర్నాలు..**

**✦ నేటి నుంచి సేవ్ సింగరేణి జాతా**



2లో..



– బెల్లంపల్లి, నస్పూర్, మార్చి 17, ప్రభాతవార్త





# కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**నస్పూర్, మార్చి 17, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థలో కార్మికుల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంస్థ వ్యాప్తంగా అన్ని గనులు, విభాగాల్లో నిరసనలు చేపట్టారు. శ్రీరాంపూర్ ఏరియాలోని గనుల వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న సీతారామయ్య మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వారసత్వ ఉద్యోగాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంస్థకు రావాల్సిన సుమారు రూ. 50 వేల కోట్ల బకాయిలను తక్షణమే రాబట్టాలని ఒత్తిడి తెచ్చారు. కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. కోల్ ఇండియాలో అమలవుతున్న విధంగానే సింగరేణి కార్మికుల పెర్క్స్‌పై ఆదాయపు పన్నును సంస్థే చెల్లించాలి. కొత్త గనులను ప్రారంభించి సంస్థ మనుగడను కాపాడాలి. కార్మికుల మారుపేర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి. గుర్తింపు కార్మిక సంఘంతో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో అంగీకరించిన హామీలను యాజమాన్యం వెంటనే అమలు చేయాలి. సంస్థను రక్షించుకునేందుకు ఈ నెల 18 నుంచి సింగరేణి వ్యాప్తంగా ఖసేవ్ సింగరేణిగ్గ పేరుతో జాతా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్.కె 7 గని నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర 29వ తేదీన కొత్తగూడెం చేరుకుంటుంది. 30న అక్కడ భారీ ధర్నా చేపడతామని వెల్లడించారు. ఈ పోరాటాల్లో కార్మికులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, ఎస్ కే బాజీ సైదా, కొట్టే కిషన్ రావు, మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, అఫ్రోజ్ ఖాన్, దాడి రాజయ్య, తౌటం మల్లేష్, మురళీ చౌదరి, మోతే లచ్చన్న, సారయ్య, ఆకుల లక్ష్మణ్, గునిగంటి నరసింగ రావు, నవీన్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, మార్చి 17, ప్రభాతవార్త**

సింగరేణి పరిధిలోని బెల్లంపల్లి శాంతి గని మైన్, కాసిపేట1, కాసిపేట2 గనుల వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నాలు నిర్వహించారు. శాంతి గని మైన్ వద్ద మంతెన రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సేవ్ సింగరేణి ధర్నాలో ముఖ్య అతిథిగా చిప్ప నర్సయ్యా పాల్గొని మాట్లాడుతూ బకాయిల విడుదల, మెడికల్ సౌకర్యాలు, హెచ్ఆర్ఏ, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలపై డిమాండ్ చేశారు. కాసిపేట1 గనిలో బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి గని మేనేజర్‌కు మెమోరాండం అందజేశారు. కాసిపేట 2 గనిలో కేంద్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ ఒప్పందాల అమలు, ఉత్పత్తి పెంపు, సంక్షేమం, నియామకాలపై చర్యలు కోరారు. మార్చి 18 నుంచి "సేవ్ సింగరేణి" ప్రచార జాత శ్రీరాంపూర్ నుంచి ప్రారంభమవుతుందని, ఈ జాతను కోనమనేని సాంబశివరావు, వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ తదితర నాయకులు ప్రారంభించనున్నారని తెలిపారు. జాత ద్వారా కార్మికులను చైతన్యం చేస్తూ అన్ని ఏరియాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. ఈనెల 30న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముట్టడి ధర్నా కార్యక్రమం జరుగనున్నందున కార్మికులందరూ భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ సాంస్కృతిక సారథి బృందంచే ఆరు గ్యారంటీలపై అవగాహన

**- సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్న సర్పంచ్ రమేష్**

**కోటపల్లి, మార్చి 17 ప్రభాతవార్త**



కోటపల్లి: మండల పరిధిలోని రాంపూర్ గ్రామ పంచాయతీలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం కళాకారులు గ్రామంలో ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల పథకాలపై తమ ఆట, పాటలతో, చైతన్యపరిచే ప్రదర్శనలతో ప్రజలకు మారుమూల గ్రామానికి కూడా అర్థమయ్యేలా సులభంగా అవగాహన కల్పించారు. పథకాల అమలు విధానం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను సాంస్కృతిక సారథి బృందం వివరంగా తెలియజేయగా, గ్రామ సర్పంచ్ మనుమండ్ల రమేష్, పంచాయతీ కార్యదర్శి శిల్ప పథకాల వివరాలను మరింత స్పష్టంగా వివరించారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం రూపొందించిన ఈ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వారు కోరారు. గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ ప్రగతి ప్రస్థానంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. 99 రోజుల ఈ ప్రణాళిక గ్రామాభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడప సంతోష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

కలిసి సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఎండాకాలం దృష్ట్యా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వెంకట్రావుపేట, దొడపల్లి, చందారం గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా పట్టాలని, ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. గృహాలు, వ్యాపార సముదాయాల వద్ద చెత్తను రోడ్లపై, మురుగు కాలువలలో వేయకూడదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ పథకం నీటి ట్యాంకుల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్‌తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న వేసవిలో ప్రజలకు నిరంతరంగా నీటిని అందించే విధంగా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

చొప్పున టీకాలు అందించే కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. మండలంలోని విజయనగరం కాలనీలో నిర్మిస్తున్న జంగుబాయి మండల సమాఖ్య భవన నిర్మాణ పనులను పరిశీలించి పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన తలుపులు, కిటికీలు బిగించే పనులు త్వరగా పూర్తి చేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు. మండలంలోని మహిళా సంఘాలు మండల సమాఖ్య సమావేశాలు నిర్వహించేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మండల సమైఖ్య సభ్యులు జిల్లా కలెక్టర్, నీతి అయోగ్ కేంద్ర ప్రతినిధిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, తిర్యాని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేముల మల్లేష్, ఎపిఎం శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది, సంపూర్ణత అభియాన్ జిల్లా సమన్వయకర్త బాల రాజు, మండల సమాఖ్య సభ్యులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇంటివద్దకే చేరిన సేవలు..

- లబ్ధిదారులకు ఊరటనిచ్చిన కౌన్సిలర్
- వృద్ధులు, వికలాంగులకు సులభమైన పెన్షన్ ప్రక్రియ
- ప్రజా సేవలో ఆదర్శంగా నిలిచిన కౌన్సిలర్ బెడ్డల సౌజన్య

**బెల్లంపల్లి, మార్చి 17, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని 3వ వార్డు అంబేద్కర్ నగర్ లో ప్రజా సేవలో మరోసారి ఆదర్శంగా నిలిచారు. కౌన్సిలర్ బెడ్డల సౌజన్యవిజయ్ కుమార్. వృద్ధులు, వికలాంగులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లలేని పరిస్థితిని గుర్తించిన ఆమె స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి అవసరమైన పత్రాలను సేకరించి, పెన్షన్ పొందేందుకు కావలసిన ఇన్‌కం సర్టిఫికెట్లను సిద్ధం చేయించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరాలని లక్ష్యంగా పెట్టుకున్న కౌన్సిలర్, వృద్ధులు, వికలాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దగ్గరగా తెలుసుకుని వెంటనే స్పందించారు. కార్యాలయాల చుట్టూ తిరగలేని పరిస్థితిలో ఉన్న వారికి ఈ సేవ ఎంతో ఉపశమనం కలిగించింది. ఈ కార్యక్రమంలో భాగంగా, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పత్రాలు సేకరించడం మాత్రమే కాకుండా, అవసరమైన ధృవపత్రాల కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసి, వేగంగా ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో అనేక మంది వృద్ధులు, వికలాంగులు తక్కువ సమయంలోనే తమ పెన్షన్ పొందేందుకు అర్హత సాధించారు. ఈ సేవా కార్యక్రమంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజల సమస్యలను అర్థం చేసుకుని ఇంటి వద్దకే వచ్చి పరిష్కారం చూపడం చాలా గొప్ప విషయం అని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రజానుకూల కార్యక్రమాలు మరింత మందికి ప్రేరణ కలిగిస్తాయని వారు అన్నారు. ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కౌన్సిలర్ బెడ్డల సౌజన్య విజయ్ కుమార్ భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా కృషి చేస్తానని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో పాత్రికేయులది కీలక పాత్ర

**- ఎస్‌సిటి చైర్మన్ సాయిని ప్రసాద్**

**జన్నారం, మార్చి 17, ప్రభాతవార్త**

ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేశాలా పత్రికలలో రాసి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో పాత్రికేయులది కీలకపాత్ర అని ఎస్.సి.టీ చైర్మన్, టి ఎన్ ఎం వి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ అన్నారు. మంగళవారం రోజున మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు చిలువేరు నరసయ్య, మండల అధ్యక్షుడు గాజుల లింగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్, కోశాధికారి శీల చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులు మేడ మురళి, కొండపెల్లి ప్రశాంత్, ప్రచార కార్యదర్శి గోనె సత్యం, సంయుక్త కార్యదర్శులు నిమిష కవి రాజేందర్, ఐలవేని నరసయ్య, మధిర సతీష్, ముఖ్య సలహాదారులు పూదరి సత్యనారాయణ, తాటి శ్రీనివాస్, కందుల రమేష్ మరీయు వెంకట పనిరాజు లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయిని ప్రసాద్ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి మాజీ అధ్యక్షుడు నరసయ్య ఎంతో కృషి చేశారని, ప్రస్తుత నూతన కార్యవర్గం కూడ మిగితా పనులను పూర్తి చేయాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్ గా భావించే పాత్రికేయ రంగం ప్రజా సమస్యల పరిష్కారం సమాజ అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చెట్పెల్లి సత్యం, వొల్లాల నర్సా గౌడ్, జునుగురి మల్లయ్య, సింగం రమేష్, వినోద్, రాము తదితరులు పాల్గొన్నారు.



తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

## కాంగ్రెస్ వైఫల్యాలపై బీజేపీ పోరు

### - తహాశీల్దార్‌కు వినతిపత్రం

**భైంసా, మార్చి 17, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ధ్వజమెత్తుతూ భారతీయ జనతా పార్టీ భైంసా పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ ఆదేశాల ప్రకారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మార్గదర్శకత్వంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా రైతుబంధు, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ల పెంపు ఊసేలేదని, మహిళలకు స్కూటీలు, తులం బంగారం, నిరుద్యోగ భృతి వంటి హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. వరి పంటకు ఇస్తామన్న 500 రూపాయల బోనస్ అమలు కాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రావుల రాము, జిల్లా కార్యదర్శి తాడేవార్ సాయినాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు గాలి రవి, కౌన్సిలర్లు నిమ్మల ప్రవీణ్, డి. శ్రీకాంత్, చర్ల సుభాష్, అల్లెం దిలీప్, నాయకులు చింతపండు మహేష్, తోట రాజు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నడిమిశెట్టి గంగాధర్ పాల్గొన్నారు.

## రైతు భరోసాకు కొత్త రైతులు దరఖాస్తు చేసుకోవాలి

**సారంగాపూర్, మార్చి 17, ప్రభాతవార్త:**

రైతు భరోసా పథకానికి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వికార్ అహ్మద్ తెలిపారు. ఫిబ్రవరి 28, 2026 నాటికి భూమి పాస్ బుక్ పొంది, డిజిటల్ సంతకం పూర్తయిన వారందరూ ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన రైతులు ఈ నెల 25వ తేదీలోపు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. గతంలో రైతు భరోసా పొందుతున్న వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కొత్తగా పాస్ బుక్ పొందిన వారు పాస్ బుక్ జిరాక్స్, డిజిటల్ సైన్ అయిన కాపీ, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలను దరఖాస్తు ఫారంతో జత చేసి అందించాలని కోరారు. గడువులోగా దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ ఫలాలను పొందాలని రైతులకు సూచించారు

## హామీల అమలు కోసం తహాశీల్దార్‌కు బీజేపీ వినతిపత్రం

**సారంగాపూర్, మార్చి 17, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సారంగాపూర్ మండల కేంద్రంలోని తహాశీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహాశీల్దార్ రవీందర్‌కు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కాల్వ నరేష్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను, ఇతర హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ప్రస్తుత బడ్జెట్‌లోనైనా హామీల అమలుకు నిధులు కేటాయించాలని కోరారు. ముఖ్యంగా రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం, కొత్త పెన్షన్ల మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చిన్నయ్య, ఎల్లన్న, గణేష్, ఉప సర్పంచులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు రాజేందర్ రెడ్డి, కర్ణ సాగర్ రెడ్డి, చెన్న రాజేశ్వర్, పతాని నరసయ్య, భూమ రెడ్డి, తిరుమల చారి తదితరులు పాల్గొన్నారు.



తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

# కార్మికుల సమస్యల పరిష్కారమే ఐఎన్‌టియుసి ధ్యేయం

**★ జెట్టి శంకర్ రావు ★ శ్రీరాంపూర్ ఆర్కే7 గనిలో బాయి బాట.. మేనేజర్‌కు వినతి**

**నస్పూర్, మార్చి 17, ప్రభాతవార్త**

కార్మికుల సమస్యల పరిష్కారమే ఐఎన్‌టియుసి ధ్యేయమని ఆ సంఘం కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావుపేర్కొన్నారు. సింగరేణి కార్మికుల ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునే లక్ష్యంతో మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె 7 గనిలో బాయి బాట కార్యక్రమంలో భాగంగా నాయకులు కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ టబ్ రిపేర్ సెక్షన్‌లో నాణ్యమైన డాబర్ పట్టీలు అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. కాలం చెల్లిన టబ్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. టిండాల్ సిబ్బందికి కొత్త చైన్ బ్లాక్స్ పంపిణీ చేయాలి. ఈ అండ్ ఎమ్ విభాగంలో నెలకొన్న ఇబ్బందులను వెంటనే తొలగించాలి. ట్రామర్లకు వార్మ్ కోట్లు అందజేయాలి. జన్మభూమి పేరుతో సాగుతున్న శ్రమ దోపిడీని తక్షణమే నిలిపివేయాలి. కొత్తగా హెల్పర్ల నియామకం చేపట్టాలి. ఎలక్ట్రిషియన్లు, ఫిట్టర్లకు ఏరియా ఫిక్సేషన్ సౌకర్యం కల్పించాలి. ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో ఓటీ అవకాశాలు కల్పించాలని కోరారు. టెక్నీషియన్ల కొరతను భర్తీ చేయాలి. చార్జ్ షీట్లు, సస్పెన్షన్లు, వార్నింగ్‌ల పేరుతో చేసే అనవసర వేధింపులు ఆపాలి. కార్మికులపై పని భారం తగ్గించాలి. పనిముట్లు, రక్షణ పరికరాలు సరిపడా సరఫరా చేయాలి. శిక్షణ, పదోన్నతి కల్పించడంతో పాటు ట్రేడ్స్ మెన్లకు సరైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అనంతరం గని మేనేజర్‌తో సమావేశమై పలు కీలక సమస్యలపై చర్చించారు. దీనిపై మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు గరిగే స్వామి, తిరుపతి రాజు, పేరం రమేశ్, కేంద్ర కార్యదర్శి అశోక్, మనోజ్, రౌతు సత్యనారాయణ, బోలిశెట్టి శ్రీకాంత్, ప్రణయ్ కుమార్, కార్తీక్ రెడ్డి, విజయ్, బెల్లం తిరుపతి, వాసం అజయ్, కొట్టె అజయ్, సురేష్ తోకల పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న ఐఎన్‌టియుసి నాయకులు



## పొనకల్ రైతు వేదికలో రైతులకు కిట్ల పంపిణీ

**జన్నారం, మార్చి 17, ప్రభాతవార్త:**

జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ రైతు వేదికలో మంగళవారం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ రైతు శిక్షణ కార్యక్రమంలో భాగంగా జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కు ఎన్నుకోబడిన ధర్మారం, లింగయ్య పల్లె, చింతలపల్లె గ్రామాలకు చెందిన 125 మంది రైతులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ప్రకృతి వ్యవసాయంపై పలు సూచనలు చేశారు .అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ ,జన్నారం క్లస్టర్ మల్యాల త్రిసంధ్య లు 125 మంది రైతులకు కిట్లతో (బ్యాగ్,క్యాలెండర్, పెన్,నోట్ బుక్,డైరీ,టోపి) పాటు ఐడి కార్డులను అంద చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు దివ్య, అక్రమ్, సర్పంచులు కొత్తపల్లి వనిత శ్రీనివాస్, పంజాల సురేష్, ఉపసర్పంచ్‌లు పిండి నరేష్, మహేందర్, రైతులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఏరియా డోర్లి ఓసి2 గనిని సందర్శించిన అధికారులు

### - మూతపడిన డోర్లి ఓసి2 గని పర్యావరణ చర్యలపై అధికారుల పరిశీలన

**బెల్లంపల్లి, మార్చి 17, ప్రభాతవార్త**



బెల్లంపల్లి ఏరియాలో మూత పడిన డోర్లీ ఓసి2 గనిని రాజేంద్ర చోలే (ఓఎస్‌డి, కోల్ కంట్రోల్ ఆఫీస్ నాగ్ పూర్), ఏ కృష్ణ మోహన్ రావు (ఓ ఎస్ డి, కోల్ కంట్రోల్ ఆఫీస్ కొత్తగూడెం)లు మంగళవారం రోజు సందర్శించారు. మూత పడ్డ గని, పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యావరణ పనులు పరిశీలించారు. నాటిన మొక్కలను, ఎదిగిన వృక్షాలను చూశారు. పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న నీటి నిర్వహణ, మృత్తిక సంరక్షణ చర్యలు వాటి వివరాలను తెలుసుకున్నారు. రక్షణ కంచెలు చూశారు. అంతకుముందు జనరల్ మేనేజర్ కార్యాలయంలో జిఎం ఎం. విజయ భాస్కర రెడ్డి బెల్లంపల్లి ఏరియా వివరాలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గోలేటి ఓసి ప్రాజెక్ట్ అధికారి నాయిని ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి అఫ్సర్ పాషా, కార్పోరేట్ అదనపు మేనేజర్ వి. తిరుపతి, డోర్లి ఓసి2 మేనేజర్ పి. మహేష్ కుమార్, ఎన్విరాన్మెంట్ అధికారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు కిట్లు పంపిణీ

**వేమనపల్లి, మార్చి 17, ప్రభాతవార్త**

నీల్వాయి రైతు వేదికలో మంగళవారం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంపై క్రింద రైతులకు 125 ఫార్మర్ కిట్‌లను మండల వ్యవసాయ అధికారి వీరన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు సహజ వ్యవసాయం ప్రాముఖ్యత పై అవగాహన కల్పిస్తూ, జీవామృతం, బీజామృతం, మల్చింగ్, అంతర పంటల సాగు వంటి విధానాలను రైతులకు వివరించారు. ప్రత్యేకంగా, ప్రతి రైతు కనీసం ఎకరంలో 20 గుంటల వరకు సహజ వ్యవసాయం ప్రారంభించాలని, దీని ద్వారా ఖర్చు తగ్గించుకోవడం, మట్టి ఆరోగ్యం మెరుగుపరచడం, ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేయడం సాధ్యమని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి హెప్సిబా, నాగరాణి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## రంజాన్ తోఫాలు పంపిణీ

**వేమనపల్లి, మార్చి 17, ప్రభాతవార్త**

రంజాన్ పర్వదిన పండుగ సందర్భంగా ముస్లిం సోదరీమణులకు రంజాన్ తోఫాను తహసీల్దార్ సాయిబాబు, మాజీ జెడ్పిటిసి ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ముందుగా ముస్లిం సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చెన్నూరి సమ్మయ్య, వుప్పులపు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

## సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఉద్యోగుల

# సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

✧ ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ సత్యనారాయణ

జైపూర్, మార్చి 17, ప్రభాతవార్త

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఉద్యోగుల సమస్యలను, సింగరేణి సంస్థ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఏఐటియూసి ఫిట్ సెక్రటరీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ జనరల్ మేనేజర్ నరసింహారావు కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తెలంగాణ జెన్ కో, ట్రాన్స్ కోల నుండి సింగరేణి సంస్థకు రావాల్సిన సుమారు 50 వేల కోట్ల బకాయిలను వసూలు చేసి, సంస్థ మనుగడకు దోహద పాడాలని కోరారు. కొత్త బొగ్గు బ్లాక్ ల కోసం కేంద్రం నిర్వహించే బిడ్డింగ్ లో పాల్గొనాలని గతంలో ఉన్న గనుల విస్తరణ కొరకు ప్రతిపాదించిన ప్రాజెక్టులను తొందరగా మొదలు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గనులలో, ఓపెన్ కాస్టలలో కొత్త యంత్రాలు కొనుగోలు చేయాలని, తద్వారా ఉత్పత్తి, ఉత్పాదకత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మిక సంక్షేమం కొరకు 2025 జూలై నుండి ఇప్పటివరకు జరిగిన మెడికల్ బోర్డులను సమీక్షించి దరఖాస్తు చేసుకున్న వారిని అన్ ఫిట్ చేసి కారుణ్య నియామకాలు ఇవ్వాలన్నారు.



సింగరేణి ఉద్యోగులందరికీ సొంత ఇంటి పథకం అమలు చేయాలన్నారు. కార్మికులకు, అధికారుల తరహాలో పెర్క్స్ పై ఆదాయ పన్నులను రిఫండ్ చేయాలన్నారు. కార్మికులను ప్రోత్సహించే విధంగా ఉత్పత్తి ఆధారిత ఇన్సెంటివ్ స్కీమ్ తీసుకురావాలని, కార్మికుడు సహజ మరణం పొందితే ఇచ్చే పరిహారాన్ని 25 లక్షలకు పెంచాలని అన్నారు. ఎన్సిడబ్ల్యూఏ కొత్త బదిలీ పాలసీని రద్దు చేయాలన్నారు. పేర్ల మార్పు సవరణలు చేసి పెండింగ్ లో ఉన్న కేసులు పరిష్కరించి, వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఎన్ 1 ప్లే డే సర్క్యులర్‌ను రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. మెడికల్ అయిపోయి వీటీసీ ట్రైనింగ్ అయిపోయిన 300 మంది కి జాయినింగ్ ఆర్డర్స్ ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని, ప్రతి సింగరేణి స్కూల్‌లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టాలన్నారు. సింగరేణి టెండర్లలో జరిగిన అవకతవకల మీద అవినీతి కార్యక్రమాల మీద విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ జోగు పర్శయ్య, ఫోర్ మాన్ రవీంద్ర కుమార స్వామి, ఓవర్సీర్ సదా శివకృష్ణ, సీనియర్ అసిస్టెంట్‌లు శ్రీనిధి, మధు, సురేష్, రాజ్ కుమార్, సంతోష్ ఇతర క్లరికల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా
- ధర్నా శిబిరానికి వచ్చిన జిల్లా వైద్యశాఖధికారులకు వినతి
- దుంపల రంజిత్ కుమార్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి

మంచిర్యాల, మార్చి 17, ప్రభాతవార్త

తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా శిబిరానికి డిఎంహెచ్ఓ, డిప్యూటీ డిఎంహెచ్ఓ, ఆశాలతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్తామన్నారు. అనంతరం జిల్లా వైద్య శాఖధికారులకు డిమాండ్స్ తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్. సమ్మక్క ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు ఫిక్స్ డ్ వేతనం చెల్లిస్తామని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ చర్చల్లో ఇన్సూరెన్స్ రూ, యాభై లక్షలు, ప్రమాద బీమా సౌకర్యం , మట్టి ఖర్చులకు రూ, యాభై వేలు చెల్లిస్తామని ఇచ్చిన హామీలు రెండు ఏండ్లు గడిచిన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని, రాష్ట్రంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం పద్దెనిమిది వేలు నిర్ణయించి చెల్లించాలి అని, దుంపల రంజిత్ కుమార్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, ఆశా వర్కర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సరైంది కాదన్నారు. జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రి ఆశాల సమస్యలు పరిష్కరించే విదంగా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా పెండింగ్లో ఉన్న జీతాలు, లెప్రసీ, ఎండిఏ డబ్బులు చెల్లించాలన్నారు. ఏఎన్సి టార్గెట్స్ రద్దు చేయాలన్నారు. ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శోభ ఆశా యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, పద్మ, భాగ్యలక్ష్మి జిల్లా ఉపాధ్యక్షురాలు, జిల్లాలోని ఆశాలు పాల్గొన్నారు.






## బెల్లంపల్లిలో ట్రాఫిక్ పరిస్థితులపై ఎసిపి కిరణ్ కుమార్ ప్రత్యేక దృష్టి

బెల్లంపల్లి, మార్చి 17, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలోని మెయిన్ బజార్‌లో ట్రాఫిక్ సమస్యలను పరిశీలించేందుకు బెల్లంపల్లి ఎసిపి కిరణ్ కుమార్ మంగళవారం పర్యటించారు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, తాళ్ల గురిజాల ఎస్ఐ రామకృష్ణతో కలిసి బజార్ ప్రాంతంలో వాహనాల రాకపోకలను సమీక్షించారు. ఈ సందర్భంగా పార్కింగ్ స్థలాలు, యూటర్న్‌లు, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న ప్రాంతాలను గుర్తించారు. ముఖ్యంగా అక్రమ పార్కింగ్ కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులను పరిశీలించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని ఎసిపి కిరణ్ కుమార్ సూచించారు. ఈ పర్యటనలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్కపల్లి వారసంత వేలం

పెంచికల్ పేట్, మార్చి 17, ప్రభాతవార్త :

మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రతివారం నిర్వహించే వారసంత ( మార్కెట్ )కు సంబంధించిన వార్షిక వేలం ఈనెల 20వ తేదీ ( శుక్రవారం ) నిర్వహించనున్నట్లు మంగళవారం మండల పంచాయతీ అధికారి మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వ్యక్తులు రూ. 5000 వేల ధరావతు రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ అధికారులు

## బెల్టు షాపులపై ఎక్సైజ్ దాడులు

- రూ. 4వేల విలువైన మద్యం స్వాధీనం
- ముగ్గురిపై కేసులు నమోదు

పెంచికల్ పేట్, మార్చి 17, ప్రభాతవార్త :

పెంచికల్ పేట్ మండలంలో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్స్చేంజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు రూ. 4 వేల విలువగల 5.04 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి బొంబాయిగూడకు చెందిన నాగపురి శ్రీనివాస్, పగిడి రంగనాథ్, ఎల్లూర్ గ్రామానికి చెందిన గణపురం సత్యనారాయణలపై కేసులు నమోదు చేసినట్లు కాగజ్ నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు లోభానంద్, సురేష్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి నరేష్‌కుమార్‌కు డాక్టరేట్

లక్ష్మణచాంద, మార్చి 17, ప్రభాతవార్త:



మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామవాస్తవ్యులు కీ.శే. పోతుగంటి పెద్దోళ్ల రాములుగంగవ్వ దంపతుల కుమారుడు నరేష్ కుమార్ రాజనీతి శాస్త్ర విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. రమణ పర్యవేక్షణలో "విద్యా హక్కు చట్టం, మహిళా సాధికారతపై దాని ప్రభావం" అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు గాను విశ్వవిద్యాలయం ఈ గౌరవాన్ని ప్రకటించింది. నరేష్ కుమార్ ప్రస్తుతం నిర్మల్, మంచిర్యాల జిల్లాల జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యునిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించి నేడు ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన గురువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి చెందిన వ్యక్తి ఉన్నత శిఖరాలను అధిరోహించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## కౌన్సిలర్ శివకృష్ణను సన్మానించి జిల్లా కళాకారులు

చెన్నూరు, మార్చి 17, ప్రభాతవార్త



నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ, ప్రజా సమస్యలపై పోరాడుతూ, వారి ఆశీర్వాదంతో నేడు చెన్నూరు మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా గెలవడం 18వ వార్డు ప్రజల అదృష్టమని టీ.ఎస్.ఎస్ జిల్లా అధ్యక్షుడు సురేందర్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని 18 వార్డు కౌన్సిలర్ ఎథం శివకృష్ణ ఇంటికి సురేందర్ వారి కళాబృందం వెళ్లి శివకృష్ణను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ ప్రజా సేవకై నిత్యం తపించే గొప్ప మనసున్న వ్యక్తి శివకృష్ణ అని అన్నారు. కడిగిన ముత్యం లాంటి వ్యక్తిని కౌన్సిలర్‌గా గెలిపించుకోవడం చెన్నూరు ప్రజల అదృష్టమన్నారు. అనంతరం శివకృష్ణపై రచించిన పాటను పాడి శాలువాతో సన్మానించారు. తన ఇంటికి వచ్చి సన్మానించిన కళాకారులకు శివకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# పరిశుభ్రత - త్రాగునీటి సమస్యలపై మున్సిపాలిటీ చర్యలు

## ప్రజాపాలనలో భాగంగా శుభ్రత కార్యక్రమం - మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మత్తులతో నీటి సరఫరా పునరుద్ధరణ

**మందమర్రి, మార్చి 17, ప్రభాతవార్త**



మందమర్రి మున్సిపాలిటీలో మరుమతులు చేస్తున్న సిబ్బంది

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమాల నేపథ్యంలో మందమర్రి మున్సిపాలిటీ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి రామన్ కాలనీ వద్ద ఉన్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పరిసర ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రిడ్జ్ పక్కన పేరుకుపోయిన దుబ్బ, దూళి, చెత్త చెదారాన్ని కుప్పలుగా చేర్చి తొలగించే కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎం. గోపికృష్ణ, ఇంచార్జి జవాన్ మేకల నరేష్ తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుందని కమిషనర్ తెలిపారు. ఇదిలా ఉండగా, భాగ్యనగర్ కాలనీ, శ్రీపతి నగర్, స్టేషన్ రోడ్, ఊరు రామకృష్ణపూర్, ఆర్.కె.-1, సుభాష్ నగర్ ప్రాంతాల్లో గత 15 రోజులుగా ఏర్పడిన మంచినీటి సరఫరా అంతరాయం పై మున్సిపల్ అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ పైపు లైన్లు కొన్ని చోట్ల జామ్ కావడం సమస్యకు కారణమని గుర్తించి, వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. సుమతి పర్యవేక్షణలో వర్కర్లు పైపులైన్లు తవ్వి మరమ్మత్తులు పూర్తి చేయడంతో మంచినీటి సరఫరా పునరుద్ధరించబడింది. ఈ చర్యలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలకు నిరంతరంగా తాగునీటి సరఫరా అందించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.



రైతులకు మినీ కిట్లను పంపిణీ చేస్తున్న ఏఓ కార్తీషా

## ప్రకృతి సాగుతోనే రైతుకు మేలు ఏఓ కార్తీషా

**చింతలమానేపల్లి, మార్చి 17, ప్రభాతవార్త:**

నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్ పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో రైతులకు మినీ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి కార్తీష మాట్లాడుతూ. ప్రకృతి సాగుతోనే రైతుకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా, పెట్టుబడి ఖర్చు కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన, ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చని రైతులకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న మినీ కిట్లను సద్వినియోగం చేసుకుని, ప్రతి రైతు ప్రకృతి సాగు దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అర్హులైన రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల చేతుల మీదుగా మినీ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటేష్, శ్రీలత, జ్ఞానేశ్వర్ మరియు మండలంలోని పలువురు రైతులు పాల్గొన్నారు.



మినీ కిట్లను పంపిణి చేస్తున్న గొర్ల రాజు యాదవ్

## ఇంటి పెరట్లోనే కూరగాయల సాగు: ఆత్మ చైర్మన్


**నెరడిగొండ, మార్చి 17, ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు స్వయంగా కూరగాయలు సాగు చేసుకునేలా ప్రోత్సహించడమే ప్రభుత్వ ఉద్దేశమని బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ అన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు, మహిళలకు ఉచిత కూరగాయల మినీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటి పేరట్లో కూరగాయలు సాగుచేయడం ద్వారా పోషకాహార భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. కార్యకమ్రంలో హెచ్ఈఓ భూమయ్య పాల్గొన్నారు.

## ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 17, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో మంగళవారం ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన 22 మందిని పరీక్షించగా అందులో 14 గురికి ఆపరేషన్ అవసరమని వారికి విడతల వారిగా ఆపరేషన్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.అలాగే ప్రతి మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించబడునని, కంటి శుక్లాలు ఉన్నవారు, కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని సిర్పూర్ శాసనసభ్యులు,ఫౌండేషన్ అధ్యక్షులు డా.పాల్వాయి హరీష్ బాబు తెలిపారు.



కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు



## అపరిశుభ్ర హోటళ్లపై మున్సిపల్ కమిషనర్ కఠినచర్యలు

**బెల్లంపల్లి, మార్చి 17, ప్రభాతవార్త:**

బెల్లంపల్లి పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని కాల్ టెక్స్ ఏరియా, బజార్ ప్రాంతాల్లో ఉన్న పలు హోటళ్లు, రెస్టారెంట్ల పై బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అరేబియన్ క్లాసిక్ నైట్స్ మండి, అబ్దుల్ రెహమాన్ మండి హౌస్, వినాయక టిఫిన్ అండ్ బిర్యాని హోటళ్లలో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకపోవడం గుర్తించి మొత్తం రూ.20,000 జరిమానా విధించారు. అపరిశుభ్ర పరిస్థితుల్లో ఆహారం తయారు చేయడం పట్ల యజమానులకు కఠిన హెచ్చరికలు జారీ చేస్తూ, వెంటనే పరిశుభ్రతను పాటించాలని ఆదేశించారు. ఇకపై ఇలాంటి ఉల్లంఘనలు పునరావృతమైతే దుకాణాలను స్వాధీనం చేసుకుని మున్సిపల్ చట్టం-2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి హెచ్చరించారు.

## హత్య నిందితున్ని ఉరితీయాలని డిమాండ్

**బెజ్జూర్,మార్చి 17, ప్రభాతవార్త:**



పెంచికలపేట్ మండలంలోని కొండపల్లి గ్రామంలో ప్రేమ పేరుతో నమ్మించి గొంతు నులిమి హత్య చేసిన నిందితుడు కేర్ కరి జలపతిని వెంటనే ఉరితీయాలని బెజ్జూర్ మండల కేంద్రంలో ఆదివాసి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.నిండు గర్భిణీ సమ్మక్క కుటుంబాన్ని ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని,సమ్మక్క కుటుంబానికి వెంటనే 25 లక్షల పరిహారం ప్రకటించాలని,కుటుంబానికి మూడెకరాల భూమి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని,భవిషత్తులో కుల హత్యలు జారకుండా కులాంతర రక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి కోయ సంక్షేమ సంఘం అధ్యక్షులు సోయం చిన్నయ్య,ఆదివాసి మండల అధ్యక్షులు కోరేత తిరుపతి,మహిళా అధ్యక్షురాలు ఏనుక అమృత,గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నైతం రాజు,సర్పంచులు ఏనుక శ్రీహరి, సడ్మేక సాయికృష్ణ,నాయకులు నందరాం,రమేష్ పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గ్రామీణ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన సభ్యులు

**నేరడిగొండ, మార్చి 17, ప్రభాతవార్త:**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సమావేశమై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గ్రామీణ డిగ్రీ కళాశాలల అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నిరుపేద విద్యార్థుల కోసం మంజూరు చేసే ఫీజు రీయింబర్స్మెంట్‌పై ఆధారపడి విద్యా సేవలు అందిస్తున్న ఈ కళాశాలలు, గత నాలుగేళ్లుగా నిధుల విడుదలలో ఆలస్యం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమస్యల పరిష్కారం, బకాయిల విడుదల, కళాశాలల స్థిరీకరణ కోసం ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నంగె శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఏ.సతీష్ రెడ్డి, ఎస్.రవి, కార్యదర్శులుగా వొడిసెల కార్తీక్, కుంభారే లక్ష్మణ్, కోశాధికారిగా చౌహాన్ నికేష్, ఈసీ సభ్యుడిగా రమేష్, సలహాదారులుగా ఎలుకూచి రాజశేఖర్, సాయులు ఎన్నికయ్యారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేసి, గ్రామీణ డిగ్రీ కళాశాలల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## విద్యార్థిని మృతికి వీసీ విధానాలే కారణం: ఓయూ జేఏసీ

**భైంసా, మార్చి 17, ప్రభాతవార్త:**



బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని మల్లిపూడి తేజస్విని మృతికి యూనివర్సిటీ యాజమాన్యమే కారణమని ఓయూ జేఏసీ అధ్యక్షులు సర్ధార్ వినోద్ కుమార్ విమర్శించారు. సకాలంలో వైద్యం అందించడంలో యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థినిని హెల్త్ సెంటర్ నుండి మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆసుపత్రికి తరలించడంలో వీసీ గోవర్ధన్ నిరక్ష్యం చేశారని మండిపడ్డారు. విద్యార్థుల ప్రాణాల కంటే వ్యక్తిగత లబ్ధి, ప్రచారానికే వీసీ ప్రాధాన్యత ఇస్తున్నారని ధ్వజమెత్తారు. యూనివర్సిటీలో మెరుగైన వైద్య పరికరాలు, డాక్టర్లను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రయోజకులు అవుదామని వచ్చిన విద్యార్థులు శవాలుగా ఇంటికి వెళ్లడం దురదృష్టకరమన్నారు. మరణించిన తేజస్విని కుటుంబానికి యాజమాన్యం రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. యూనివర్సిటీని నడపడం చేతకాకపోతే వీసీ వెంటనే రాజీనామా చేయాలని, అవినీతి అక్రమాలపై త్వరలోనే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# ప్రకృతి వ్యవసాయ సాగుతో ఆరోగ్యం

**హాజీపూర్, మార్చి 17, ప్రభాతవార్త**

ప్రకృతి వ్యవసాయ సాగుతో ప్రజల జీవన ప్రమాణాన్ని మరింత పెంపొందించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాలలో జాతీయ మిషన్ ఫర్ ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అందించి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సాగులో సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువులు, సాగు పద్ధతులు అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు సాధించవచ్చని, తద్వారా ప్రజలకు మరింత ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు. రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని, పంట సాగులో రైతులకు అవసరమైన మెలకువలను అందించి అధిక దిగుబడి సాధించేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. 10 సంవత్సరాల పాటు ప్రకృతి వ్యవసాయ సాగు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, ప్రకృతి వ్యవసాయ రైతు కొట్టే రవీందర్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 15 రైతువేదికలలో ఒక వేయి 875 మందితో వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పథకం పురోగతి దిశగా జిల్లాలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆత్మ చైర్మన్ సింగతి మురళీ, కార్పొరేటర్లు బియ్యాల త్రివేణి, కమల, లగిశెట్టి రాజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


గుడిపేట రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్


రైతులకు కిట్లను పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

## రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

### - తిర్యాని ఏవో వినయ్ రెడ్డి

**తిర్యాని, మార్చి 17, ప్రభాతవార్త:**

రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకుని భూమి సారవంతాన్ని పెంచుకోవాలని తిర్యాని మండల వ్యవసాయ అధికారి కె వినయ్ రెడ్డి కోరారు. మండలంలోని గిన్నెధరి రైతు వేదికలో మంగళవారం నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్ కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు మినీ కిట్లను పంపిణీ చేశారు. ఈ మినీ కిట్ల ద్వారా రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను సులభంగా అమలు చేసేందుకు అవసరమైన సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వినయ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించి, సహజ వనరులను ఉపయోగిస్తూ పంటల ఉత్పత్తి పెంచుకోవచ్చని తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారవంతత పెరగడంతో పాటు రైతుల ఖర్చులు తగ్గి, లాభాలు పెరుగుతాయని ఆయన వివరించారు. రైతులు ఈ పద్ధతులను అనుసరించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విభాగానికి చెందిన ఏఈఓలు శ్రవణ్, సాగర్ లు పాల్గొని రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, వాటి అమలు విధానం, మినీ కిట్ల వినియోగం వంటి విషయాలను వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంపై అవగాహన కార్యక్రమం

**లక్షెట్టిపేట, మార్చి 17, ప్రభాతవార్త**



వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీకాంత్ అన్నారు. మంగళవారం రోజు జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకం క్రింద చందారం క్లస్టర్ రైతులకు రైతు వేదిక లక్షెట్టిపేటలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమంతో పాటు కిట్లను పంపిణీ చేయడం జరిగింది. ఇందులో ఒక బ్యాగ్, స్క్రిబ్లింగ్ ప్యాడ్, పెన్, ఐడి కార్డ్, ఒక ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన సమాచారం కలిగినటువంటి పుస్తకం రైతులకు పంపిణీ చేయడం జరిగింది. కిట్‌తో పాటు భూసార పరీక్ష పత్రాలు కూడా రైతులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

### - హౌసింగ్ డిఈ మునీందర్

**మందమర్రి రూరల్, మార్చి 16, ప్రభాతవార్త :**

మండలంలోని ఇందిరమ్మ ఇంటి పథకం లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ ఇంజినీర్ మునీందర్ సూచించారు. సోమవారం మండలంలోని ఇందిరమ్మ ఇంటి పథకం పైలట్ గ్రామపంచాయతీ పొన్నారం గ్రామంలో గ్రామ సర్పంచ్ పెంచాల మధు తో కలిసి పర్యటించి లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మునీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన వారికి సకాలంలో బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇంటి పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శి హరీష్, ఈద లింగయ్య, కాంగ్రెస్ నాయకులు పెంచాల రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

## డొమెస్టిక్ సిలిండర్లు వాణిజ్య అవసరాలకు వాడితే కఠిన చర్యలు


తనిఖీలు చేస్తున్న ఎస్సై మధుకర్

**కెరమెరి, మార్చి 17, ప్రభాతవార్త:**

డొమెస్టిక్ సిలిండర్లు వాణిజ్య అవసరాలకు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎన్ మధుకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అన్ని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, దాబా హోటల్‌లలో ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. వ్యాపార సంస్థల్లో వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లను పరిశీలించి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. కెరమెరిలో చేసిన తనిఖీల్లో మిస్బా దాబా (రాథోడ్ విక్రమ్), ఆద్య దాబా(రాథోడ్ సుదర్శన్), పద్య టిఫిన్ సెంటర్ (ముజాంబిల్ సైద్), అగ్ర స్వీట్ హౌస్ (సనే చునిలాల్)లలో 4 డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్నట్లు గుర్తించి హోటల్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హోటళ్లు, దాభాలు, టిఫిన్ సెంటర్లలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. వ్యాపార సంస్థలు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.



## అగ్ని ప్రమాదాలపై అవగాహన

**జన్నారం, మార్చి 17, ప్రభాతవార్త**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా జన్నారం మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో మంగళవారం మండల ఫైర్ అధికారి దేవనంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ఒకవేళ అనుకోకుండా సంభవించిన గానీ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఉపాధ్యాయులకు విద్యార్థులకు మండల ఫైర్ అధికారి శ్రీనివాస్ క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ ఫైటర్ సతీష్, టెక్నికల్ ఫైర్ ఫైటర్లు వినోద్, ప్రశాంత్ ఫైర్ ఫైటర్ కళ్యాణ్, పాఠశాల కరస్పాండెంట్ అమరగొండ సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**జన్నారం, మార్చి 17, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని మంగళవారం మండల బీజేపీ అధ్యక్షుడు గుండవరపు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో తహశీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతు భరోసా, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్థిక సహాయం, నిరుద్యోగ భృతి వంటి కీలకమైన వాగ్దానాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని, లేని పక్షంలో ప్రజల పక్షాన బిజెపి పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టాపూర్ సర్పంచ్ వాసాల నరేష్, పొనకల్ ఉప సర్పంచ్ అప్పాల జలపతి, కొంతం శంకరయ్య, బద్రి నాయక్, వెయికండ్ల రవి, రమేష్ గౌడ్, సంతోష్ నాయక్, పిట్ట రాజారావు ,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ బాల్ బ్యాడ్మింటన్‌లో గోల్డ్ మెడల్ సాధించిన శ్రావణికి ఘన సత్కారం

**మంచిర్యాల, మార్చి 17, ప్రభాతవార్త**

ఇండోనేషియాలో ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన శ్రీహర్ష డిగ్రీ కళాశాల విద్యార్థిని దేవల్ల శ్రావణిని కళాశాల యాజమాన్యం మంగళవారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి శ్రావణి విజయాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పల్లె భూమేష్ మాట్లాడుతూ, శ్రావణి డిగ్రీ చదువుతో పాటు అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో ప్రతిభ కనబరిచి దేశానికి పేరు తీసుకురావడం గర్వకారణమని అన్నారు. ఆమె సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు ఒలింపిక్ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పోటు మనోహర్ రెడ్డి, తనుగుల శ్రావణ్, ప్రిన్సిపాల్ అరెల్లి అనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని శ్రావణిని అభినందించారు.





కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు



పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

# ఉచిత కంటి శస్త్ర చికిత్సలు.. సేవలో ముందున్న మెమోరియల్ సొసైటీ

**- మెమోరియల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి - మున్సిపల్ వైస్ చైర్మన్ డా.కొత్తపల్లి అనిత**

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 17, ప్రభాతవార్త :**

కొమురం భీం జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టిస్పెషలిటీ ఆసుపత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మీ చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ముందుండి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేయించి సేవలు అందిసున్నారు. మెమోరియల్ సర్వీస్ సొసైటి వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి వేల మందికి వెలుగు ఇస్తు సేవలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 29 మంది హాజరు కాగా వీరికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 13 మందికి శస్త్రచికిత్స అవసరమని వారు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత మాట్లాడుతూ కంటి పరీక్షలకు వచ్చిన వృద్ధులను అధైర్య పడవద్దని లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్‌లు చేపిస్తామని అన్నారు. గత మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల్లో ఎంపికైన క్యటరక్ట్ పేషంట్లను సొసైటీ ఖర్చులతో రవాణా, భోజనం సదుపాయం కల్పించి 18 మందికి ఆపరేషన్ కోసం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించినట్లు డా.కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలలో వేల మందికి ఆపరేషన్ చేయించామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆపరేషన్ చేయించికొని లబ్ధి పొందిన వారు మరి కొంతమందినీ ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్తమలజిస్ట్ శ్రీనాథ్,గోపి, కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటా: సర్పంచ్ కావేరి

**నార్నూర్, మార్చి 17, ప్రభాతవార్త:**

గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ బాణోత్ కావేరి అన్నారు. మంగళవారం నార్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సాధారణ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా గ్రామాభివృద్ధికి విడుదలైన నిధుల వివరాలను ప్రజలకు వివరించారు. వివిధ వార్డుల్లో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల పనుల గురించి తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇప్పటికే గ్రామంలోని ప్రతి వీధిలో ఫ్లడ్ లైట్లు, వీధి దీపాలు ఏర్పాటు చేశామని, మిగిలిన చోట్ల త్వరలోనే బిగిస్తామని పేర్కొన్నారు. వ్యక్తిగత విభేదాలు పక్కన పెట్టి గ్రామ ప్రగతికి ప్రతి ఒక్కరూ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. అందరి సహకారంతో నార్నూర్‌ను జిల్లాలోనే ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని వెల్లడించారు. ఈ సభలో సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బాణోత్ గజానంద్ నాయక్, ఉప సర్పంచ్ మహమ్మద్ ఖురేషి, డిప్యూటీ తహశీల్దార్ శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శి మోతీరాం పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ కావేరి

# ప్రజల ఆరోగ్యానికి చేరువలో స్పెషలిస్ట్ వైద్యులు

**- మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా శిబిరం ప్రారంభం**

**మందమర్రి, మార్చి 17 ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని దీపక్ నగర్ ప్రాంతంలో గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. తెలంగాణ ప్రభుత్వ "99 రోజుల ప్రజాపాలన" కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ టి. రాజలింగు ప్రారంభించగా, డాక్టర్ జాహ్నవి మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించబడ్డాయి. ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తిస్తూ మూడు ప్రధాన విభాగాల్లో నిపుణులైన వైద్యులు ఉచిత పరీక్షలు నిర్వహించారు. స్త్రీ రోగ విభాగంలో డాక్టర్ మనోజ్ఞ మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన సలహాలు అందించారు. శిశు వైద్య విభాగంలో డాక్టర్ సౌజన్య పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత వైద్య విభాగంలో డాక్టర్ సునీల్ దంత పరీక్షలు చేసి నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ టి. ప్రశాంతి, పబ్లిక్ హెల్త్ మేనేజర్ కె. సురేఖ పర్యవేక్షించారు. మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, సిస్టమ్ మేనేజర్ ఏ. శిరీష్, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బి. శ్యాంబాబు పాల్గొన్నారు. కార్యక్రమ సమన్వయాన్ని ఎంఎల్‌హెచ్‌పీ మిస్ కె. తబితా, ఎంఓ అసిస్టెంట్ కె. సమ్మయ్య నిర్వహించారు. యూపీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు శిబిరం విజయవంతం కావడానికి సహకారం అందించారు. స్థానిక ప్రజలకు నిపుణులైన వైద్య సేవలను వారి ప్రాంతానికే అందించడమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రాయలింగు

# సింగరేణి భద్రతా పోటీల్లో శ్రీరాంపూర్ ఎంవీటీసీకి అగ్రస్థానం

**- మేనేజర్ కమరుద్దీన్‌కు బీసీ అసోసియేషన్ ఘన సన్మానం**

**నస్పూర్, మార్చి 17, ప్రభాతవార్త**

సింగరేణి వ్యాప్తంగా నిర్వహించిన 2025 వార్షిక భద్రతా పోటీల్లో శ్రీరాంపూర్ ఎంవీటీసీ ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. ఈ అపురూప విజయం సాధించిన సందర్భంగా సింగరేణి కాలరీస్ బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ నాయకులు మంగళవారం ఎంవీటీసీ మేనేజర్ కమరుద్దీన్‌ను సన్మానించారు. సంస్థ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచడం ఏరియాకు గర్వకారణమని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గనుల్లో ప్రమాదాల నివారణకు, కార్మికులకు మెరుగైన అవగాహన కల్పించడంలో ఎంవీటీసీ కృషిని వారు కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ ముస్కె సమ్మయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శులు బరపాటు మారుతి, బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి చంద్రమోహన్, జాయింట్ సెక్రటరీ కొట్టె శ్రీకాంత్, ఎస్సార్పీ 3 బీసీ పిట్ సెక్రటరీ పాల్గొన్నారు.



ఎంవీటీసీ మేనేజర్ కమరుద్దీన్‌ను సన్మానిస్తున్న బీసీ అసోసియేషన్ నాయకులు

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యానందించాలి: వేల్పుల రవీందర్

**- ఆర్.కె 8 కాలనీ పాఠశాల విద్యార్థులకు కుర్చీల పంపిణీ**

**నస్పూర్, మార్చి 17, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యానందించడమే ప్రధాన లక్ష్యమని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ వేల్పుల రవీందర్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్.కె 8 కాలనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన నర్సరీ విద్యార్థుల సౌకర్యార్థం 20 కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మార్గదర్శకత్వంలో, మేయర్ ధరణి మధుకర్ నాయకత్వంలో డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. పాఠశాలలోని తరగతి గదులు, పరిసరాలను కార్పొరేటర్ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రవీందర్ కోరారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు ఇంచార్జ్ చిలుక మల్లేష్, నాయకులు చిలుముల రాయమల్లు, పొట్లపల్లి శ్రీరాములు, బండి తిరుపతి, మోతే కాంతయ్య. మహిళా నాయకురాళ్లు కొప్పర్తి రాజేశ్వరి, తాండ్ర శారద, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కార్పొరేటర్ వేల్పుల రవీందర్